"సరే."

అతనికి నిన్నటి ఆమె ఒక మేలు జ్ఞప్తికి వచ్చింది. దానితో తృప్తి, ఆత్మసంయోగం, విభిన్నతనుండి ఏకత్వం కలిగినవి. అతనికి వెంటనే నిద్రవచ్చింది.

అతడు నిద్రలో మసులుతుండగా కల తెగిపోయినది. తన పాదాలవద్ద సీత మెత్తని దేహం తగిలి లేచికూచున్నాడు. గబగబా దింపు తొలిగించి ఆమె కాయితంతీసి చదువసాగాడు.

సడలిపోతున్న ఆమె దేహాన్ని తన చేతుల్లోకి తీసుకొన్నాడు. "సీతా...సీతా...నాసీతా."

ఆమెకళ్లు అప్పటికే నిమీళితములైనవి. ఆమె వేరొకలోకంనుండి మాట్లాడింది.

"మీ సావిత్రిని. తన నాధుని ప్రాణాలు రక్షించుకొన్నది. నా నాధుడనంతుడు. మీ సావిత్రి గాధ చదువుకొన్నారా ప్రాణేశ్వరా? నాకు వాగ్దానం చెయ్యండి...చెయ్యండి"

అతడు కన్నీళ్ళు నాపుకొనకుండానే ఆమె పెదిమలను గట్టిగా ముద్దిడుకొన్నాడు. అతని నోటినుండి ఒకటేమాట—

"నా సీతవు. నా సీతవు."

ఈ మాటు ఆమెగొంతు దివ్యలోకాలనుండి పలికింది. "మీరు...వాగ్దానం యివ్వరూ... ఇవ్వరూ?"

వివేక్ ఆమెముఖంలో తనముఖం దాచుకొన్నాడు.

"నేను పార్వతిని అన్యాయం చెయ్యను... చెయ్యను."

"అట్లాగాదు..." ఆమె మళ్ళీ అడిగింది—

"నేను ఆ వుత్తరంలో రాసినట్లుగా...మీసావిత్రి మీ పత్ని కోరినట్లుగా—"

అతడు బావురుమని ఏడ్చాడు.

"పార్వతి నా సహధర్మచారిణి...చేశాను... వాగ్దానం చేశాను...సీతా..."

ఆమె అతని చేతుల్లో ఒరిగిపోయింది.

(సమాప్తం)

---

కథానిక

# గ్రామ సౌభాగ్యం

కె. వి. సుబ్బయ్య

వెంకటపతినాయుడు పంచాయితీ బోర్డు ప్రెసిడెంటు. పదేళ్లుగా యెదురులేకుండా ప్రెసిడెంటు గిరీ వెలిగిస్తున్నాడంటే అది అచ్చగా అతగాడి ఘనతేకాదు. ఊళ్ళోని కాపులు రెండుపార్టీక్రింద సరిమానంగా చీలివున్నా... దిట్టమైన కుర్రవాళ్ళగ్యాంగు ఒకటి నాయుడుగారి పక్షాన కోపు వేసుకోబట్టే యీయనగారి అధికారం యెదురులేకుండా సాగిపోతూంది.

వెంకటపతి గారు పరువైన కుటుంబానికి చెందిన పెద్ద కాపుక్రింద లెఖ్ఖే. అయితే ఆయనను మించిన పెద్దకాపుల చేతుల్లో యీయన కీలుబొమ్మని చాలామంది అంటూవుంటారు. అదెలాగున్నా కుర్రగ్యాంగుమాటకు యెదురు చెప్పడమంటే నాయుడుగారికి హడలనే చెప్పాలి. ఎందుకంటే యీ కుర్రకారు తామబట్టిన కుందేటికి మూడేకాళ్లు అని బిర్రబిగించుకొని నిద్రనీలుక్కొని పట్టిన పట్టువదలకుండా చచ్చిందాకా లాగేరకం. అదేకారణం కామోసు ప్రెసిడెంటుగారి పక్షంలోని పెద్దకాపులంతా యీ కుర్రకారుకు అడుగులకు మడుగులొత్తవలసిన పరిస్థితులు కూడా యెన్నోసార్లు యేర్పడ్డాయి. కాదంటే ఎదిరిపక్షంలోకి గెంతుతామంటారు. వీళ్ళంతా యెదిరిపక్షానికి వెళ్ళితే నాయుడుగారి పక్షం పూడగొట్టిన నాగటిదుంప ఔతుంది.

ఈ గ్యాంగుకు వుండవలసిన లక్షణాలన్నీ వున్నాయి. ఒకరినికొట్టగలరు. ఒకరిచేత కొట్టించు

కోగలరు. ఆనగలరు. అనిపించుకోగలరు. వీళ్ళల్లో వీళ్ళే తన్నుకున్న సందర్భాలుకూడా వున్నాయి.

అయితే ఒక విషయంలో మాత్రం వీరిలో గొప్ప క్రమశిక్షణవుంది. వీరినాయకుడు గోపాలం యెందర్ని తంతున్నా "కుయ్" అనకూడదు. గోపాలం యేదో ఒక సందర్భంలో దాదాపు అందర్నీ నలుగు పెట్టాడనే చెప్పాలి. ఎన్నో సార్లు పెద్దకాపుల పైకిగూడా జగడానికి పోయేవాడు. యీ కాపులంతా గోపాలం దెబ్బకు కిక్కురుమనకుండా కొంపలో దూరేవాళ్ళు.

నిషాలోవున్నప్పుడు యీ నాయకుడు వళ్ళు మరచిపోతాడు. అనవసరంగా అందర్నీ తంతాడు. అదిఅతగాడికి సరదా. ఆ ఊళ్లో పోలీసు స్టేషన్ ప్రక్కనే నాటుబట్టీలున్నాయి కాబట్టి పోలీసు పెద్దలుగూడా తరచుగా నిషాయెక్కించుకుంటూ వీరితో యేకమైపోవడంకూడాకద్దు. బట్టీ పారిశ్రామికులు నాటునీళ్లు యివ్వనప్పుడు ఇద్దరూ యేకమై వాళ్ళపని పట్టిస్తారు. అందుకనే బట్టీ వ్యాపారస్తులు యేరోజుకారోజు వీళ్ళిద్దరికీ మామూళ్లు చెల్లించుకోక తప్పదు.

ఒకరోజు యేదోసందర్భంలో యీగ్రూపులో వుండే నాగరాజు అనే అతణ్ణిపట్టుకొని గోపాలం మర్దనచేశాడు. నాగరాజు కర్మవశాత్తు యెదురు తిరిగాడు. దాంతో బాగా నలుగుబెట్టాడు. నాగరాజు పాపం వుక్రోషంపట్టలేక ప్రెసిడెంటు నాయుడుగారి దగ్గర ఫిర్యాదు చేసికొన్నాడు. పాపం! నాయుడుగారు మాత్రం యేంజేస్తాడు. గోపాలాన్ని విచారించేందుకు మా పంచాయితీ కోర్టుకు జూరిస్ డిక్షన్ లేదన్నాడు. అంతటితో వూరుకోక నాగరాజు పోలీసురిపోర్టు చేశాడు. గోపాలాన్ని పట్టుకునేందుకు పోలీసువారు తమకు పవర్సు లేవన్నారు. దాంతో పాపం నాగరాజు చేసేదిలేక చెవులు ఝూడించుకుంటూ కొంపలో దూరాడు. మళ్ళీ యీ విషయం యెవరికైనా తెలిస్తే మూడవ పర్యాయం మూడుతుందేమోనని.

ఊళ్ళో పంచాయితీకోర్టు పేరుకువున్నా మామూలుగా సంభవించే జగడాలు తీర్చేది గోపాలంగారిముఠా మాత్రమే. వీరి తీర్పు అతి విచిత్రంగా వుంటుంది. ఒకసారి ఆ వూళ్ళోని చాకలి పడివేలుకు మంగలి లింగన్నకు తగాదా వచ్చింది. వాళ్ళిద్దరిలో చాకలి పడివేలు కాస్తంత బుర్రకలవాడు. ముందుగా అతగాడు గోపాలం దగ్గరకు వెళ్ళి తన చాకిరేవు గోనెను మంగలి లింగడు దొంగిలించి- అదేమని అడిగితే మంగలి కత్తితో పొడవచ్చాడని ఫిర్యాదుచేసుకొన్నాడు. ఆ క్షణంలోనే గోపాలంగారిముఠా బాగా నిషా యెక్కించుకొని మంగలి లింగన్న యింటిపైబడి లింగన్నను సున్నంసున్నం జేశారు. ఈ సంగతి పంచాయితీబోర్డులో కాస్తంత పెత్తనం చెలాయిస్తున్న పెద్దకాపు గురవయ్యనాయుడు తెలిసికొని "వూళ్ళో పంచాయితీకోర్టు వుండగా జగడాలు తీర్చేందుకు మీకెవడు పెత్తనమిచ్చాడు" అని గోపాలాన్ని మందలించాడు. ఆ మందలింపునకు "కొంపలో కూర్చుని మహా మాట్లాడుతున్నావుగాని- ఆ అనే మాటేదో రచ్చబండ దగ్గర అను ... నీ సంగతీ - నీ పంచాయితీకోర్టు బండారాన్నీ తేలుస్తాము" అని తొడచరిచాడు గోపాలం. ఇదింకా ముదిరితే పెద్దకాపు పెత్తనం పంచాయితీబోర్డుతో సహా యెక్కడ యెగిరి పోతుందోనని నోరుకుక్కుకొని వూరుకున్నాడు గురవయ్య నాయుడు.

మొత్తంమీద యీ ముఠా అంటే యెదిరి పక్షంమాట అటుంచి పంచాయితీబోర్డులోని పెద్ద కాపుల పక్షానికే తలనొప్పిగా పరిణమించడంతో ఎదిరిపక్షపు కాపులతో రహస్యంగా రాజీబేరాలు గూడా సాగించాడు పెద్దకాపు గురవయ్య. ఈ విషయం గోపాలం ముఠాకు తెలియడంతో వాళ్ళపని నిప్పులో వుప్పుగల్లు వేసినట్లై మేమే మీలోకి వస్తామని యెదిరి పక్షంతో గోపాలం ముఠా ఘాటుగా రాయబారాలు సాగించడం ప్రారంభించింది. ఈ నాటునీళ్ళ పెద్దమనుషులతో యెప్పుడైనా మనకీ తలనొప్పేనని యెదిరిపక్షంలోని నాగప్పనాయుడు రాజీకి ఒప్పుకోలేదు.

"ఇక లాభంలేదు; వీళ్ళిద్దరితోటీ మనకు కుదరదనుకొని తామే ఒక స్వంతపార్టీని నిర్మించుటకు నిశ్చయించుకొన్నారు. స్వంతపార్టీ నిర్మాణవిషయమును గురించి మాట్లాడుకొనేందుకు ఉగాదినాడు సమావేశం వేసికొన్నారు.

ఈ గాదికి గ్రామాలలో చాలా వుత్సాహంగా వుంటుంది కదా! నాటుబట్టీలకు గిరాకీ; జీవజంతువులకు కైలాసప్రాప్తీ-ఆ రోజే కాబట్టి - అట్టి శుభముహూర్తాన యీ ముఠాలోని ఒక్కరు గూడా బీకుపోకుండా వూరి పడమటి పొలిమేర లోని పాడుపడిన చావడిలో సమావేశమయ్యారు.

ఈసారి పంచాయితీ బోర్డులో స్వతంత్రంగా పోటీజేసి బోర్డుపరిపాలనను చేబట్టాలని గోపాలం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని యేకగ్రీవంగా ఆమోదించారు. మన నాయకుడు గోపాలంగారిని యికనుండి సర్దార్ గోపాలం అని పిలవాలని రాబందుల సుబ్బన్న ప్రవేశపెట్టిన తీర్మానాన్ని గూడా కరతాళధ్వనులమధ్య ఆమోదించారు. అలా పిలవనివాళ్ళను అందరూకలిసి హూనం చెయ్యాలనే వెంకోబరావు పెట్టిన మరోతీర్మానం గూడా అంగీకరించబడింది.

ఆ తర్వాత యీ క్రింది ఎన్నికల ప్రణాలికను ఆమోదించారు.

ఈ గ్రామపు పంచాయితీ సరిహద్దులోవుండే నాటు బట్టీలపై స్థానికపన్ను విధించబడదు. బట్టీలపైకివచ్చే పోలీసువారికి పంచాయితీబోర్డే బుద్ధి చెప్పగలదు.

పగలంతా నాటు కల్లబ్బుల్లో చీట్లపేక ఆడే వారికి రాత్రిపూట పొలంపని జేసికొనుటకు పంచాయితీబోర్డే లాంతరు, కిరోసిన్ సప్లయి చేస్తుంది.

నేరాలు చేసినాడనే ఫిర్యాదులు చేయబడిన వారిపై జరిమానాలను రద్దుజేసి-కొరడాదెబ్బలు ప్రవేశపెట్టబడును.

ఎవరు ముందు ఫిర్యాదు చేసుకొంటాడో (నేరంచేసినవాడైనా సరే) వారికే తీర్పు అనుకూలంగా జరుగుతుంది.

"మేము అధికారంలోకి వస్తే పై ప్రణాలిక లోని అన్నిఅంశాలనూ తూ. చా. తప్పకుండా అమలు జరపగలం."

ఎన్నికల ప్రణాలిక ఆమోదింపబడాక తర్వాత భీమారావు అభినందనలతో సభ ముగిసింది. వీరి ముఠాకు కోశాధికారిగా హేమంతరావు నియమించబడ్డాడు.

ఈ సంగతి నాయుడిగారి పార్టీకి తెలిసింది. పెద్దకాపులకు వళ్ళంతా కంపరమెత్తునా-నోరు మెదపకుండా బెట్టుగా కూర్చున్నారు. అదేమని గోపాలాన్ని అడగనూలేదు.

పంచాయితీబోర్డు యెన్నిక లొచ్చాయి. సర్దార్ గోపాలం పార్టీతరఫున ప్రచారం జోరుగా సాగుతూంది. పోలింగురోజు గోపాలం ముఠా బందోబస్తుగా; బాగా నిషా యెక్కించుకొని తయారైంది. ఎన్నికలు ముగిశాయి. నాయుడుగారి ముఠాయే మళ్ళీ అధికారాని కొచ్చింది. నిషాలోవున్న గోపాలం ముఠాకు ఆ సంగతి తెలియనే తెలియదు. అసలు గోపాలం నామినేషన్ వేస్తేగా?

ఈలోగా యెవరో పంచాయితీబోర్డు ప్రెసిడెంటు సర్దార్ గోపాలానికి జై! అన్నాడు. ఆ మాట వింటంతోటే గోపాలం ముఠా చంక లెగరేసుకుంటూ - విజయగర్వంతో వూరి వెలపల పాడుపడిన పాకదగ్గరకు పయనమయ్యారు.

ఇప్పటికీ మాట వరసకు వూళ్ళో పెద్ద కాపులంతా గోపాలాన్ని ప్రెసిడెంటుగారంటే అతను తబ్బిబ్బయ్యేవాడు. అతగాడికి కావలసింది ఆ మాట ఒక్కటే. పాపం యిప్పటికీ ఆ సర్దారుకు అసలు రహస్యం తెలీదు.

